
సాక్షి బాపట్ల

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



సీతారామలక్ష్మణులకు వెండి వస్త్రాలు

మాచర్ల: పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న కోదండ రామాలయంలో రామలక్ష్మణులకు వెండి పంచెలు, సీతమ్మకి వెండి చీర సమర్పించారు. ఎమ్మెల్యే జూలకంటి పాల్గొన్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 7508 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 340 క్యూసెక్కులు వదిలారు.



గ్రామదేవతలకు బోనాలు సమర్పణ

దాచేపల్లి: మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో అంకమ్మ తల్లి, గంగమ్మ తల్లికి గురువారం బోనాలు సమర్పించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

మాచర్ల కోర్టు జడ్జిగా ప్రశాంత్ బాధ్యతల స్వీకారం



మాచర్ల: మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో అడిషినల్ క్రిమినల్ కోర్టు జడ్జిగా పి ప్రశాంత్ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఆయన మాచర్ల సివిల్ జడ్జి కోర్టులో అడిషినల్ క్రిమినల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. మాచర్ల సివిల్ క్రిమినల్ జడ్జిలుగా రెండు పోస్టులున్నాయి. కొన్ని రోజులుగా క్రిమినల్ కోర్టు జడ్జి పోస్టు ఖాళీగా ఉండగా శ్రీనివాస్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా జడ్జిగా ఎంపికైన పి ప్రశాంత్‌ను మాచర్ల క్రిమినల్ కోర్టు జడ్జిగా నియమించటంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్ బాధ్యతలు నిర్వహిస్తారు. తిరుపతికి చెందిన ప్రశాంత్ ఇటీవల సివిల్ న్యాయమూర్తుల పరీక్షల్లో న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. ఆయన మాచర్లలో జడ్జిగా ఫస్ట్ పోస్టింగ్‌లో చేరారు. ఈయనను సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాస్ కళ్యాణ్, పీపీ, ఏజీపీ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పలువురు అభినందించారు.

ఈవీఎంల పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి మార్కెట్ యార్డు గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా ఇంచార్జి ఆర్డీవో గంగరాజు గురువారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, రికార్డులను తనిఖీ చేశారు. మరమ్మతులకు గురైన 39 వీవీ ప్యాడ్స్‌ను కంటైనర్‌లో బెంగుళూరులోని బెల్ కంపెనీకి పంపిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట గుంటూరు తహసీల్దార్ నగేష్, ఇంచార్జి తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, నియోజకవర్గాల రెవెన్యూ సిబ్బంది, నాయకులు ఎం.శివరామిరెడ్డి, ఆరె పున్నారెడ్డి, పి.చిన్న, రామమోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సుగాలీ కాలనీ జెడ్పీ పాఠశాలకు క్రీడా ప్రతిభా అవార్డు



సత్తెనపల్లి: సత్తెనపల్లిలోని సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లాలోని పాఠశాలలకు సంబంధించి నిర్వహించిన స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీలో నాలుగో స్థానం సత్తెనపల్లి సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దక్కించుకుంది. జిల్లా కలెక్టర్ పి.అరుణబాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఈవో ఎం.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా గురువారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రామనాథం వాసు, పాఠశాల పీడీలు ఎస్‌కె.ఎండీ.రియాజ్, సుధారాణి, పీఈటీ నరసింహారావులు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ క్రీడా ప్రతిభ అవార్డును అందుకున్నారు.

యార్డుకు 56,735 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 56,735 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 55,261 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 16,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 22,347 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్న తశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.



డాక్టర్లకు రక్షణ కల్పిస్తేనే పేషెంట్లకు వైద్యం

కోలకతా సంఘటన చాలా బాధాకరం. దీనికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టుచేసి వారికి సరైన శిక్ష విధించాలి. కుల, మత, ప్రాంతాలకతీతంగా రోగులకు సేవలు అందజేసే డాక్టర్లపై అమానుష దాడులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయి. దీనికి కారణం సక్రమంగా చట్టాలు అమలుకాకపోవటమే. ప్రభుత్వ హాస్పిటళ్లలో పోలీసు అవుట్ పోస్టు, సీసీ కెమెరాలు పర్యవేక్షణ తప్పనిసరి చేయాలి. వారికి రక్షణ ఉంటేనే సరైన వైద్యం అందివగలుగుతాం. అప్పుడే విధుల్లో ఉన్న డాక్టర్లకు కొంతమేర రక్షణ.

-డాక్టర్ కె.చెన్నారెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట



ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు కావాలి



రాత్రి సమయంలో విధులు నిర్వహించే చోట మహిళలకు ప్రత్యేక భద్రతా చర్యలు అవసరం. కోల్‌కతా సంఘటన ఈ అవసరాన్ని గుర్తుచేస్తోంది. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో ఏర్పాట్లకు కావాల్సిన నిధులు ప్రభుత్వం సమకూర్చాలి. ప్రభుత్వ వైద్యశాలల్లో పోలీసుల పహారా, సీసీ కెమెరాల నిఘా 24గంటలూ ఉండాలి. డాక్టర్లకు రక్షణ ఉంటేనే విధులు సక్రమంగా నిర్వహించగలుగుతారు.

-డాక్టర్ గజ్జల ప్రియాంక, ఎనస్తీషియా, క్రిటికల్ కేర్, నరసరావుపేట

రాజు కోటలో రగిలిన చిచ్చు!

- బాపట్ల నియోజకవర్గంలో రేగిన అసమ్మతి
- ఎమ్మెల్యే తీరుపై కాపు, రెడ్డి, బీసీ వర్గాల ఆగ్రహం
- అన్నింటా సొంత వారికే పెద్దపీట వేస్తున్న వర్మ
- టీడీపీని వీడేందుకు సిద్ధమైన కీలక నాయకులు

బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మపై అనతి కాలంలోనే నియోజకవర్గంలో అసంతృప్తి రాజుకుంది. సొంత సామాజిక వర్గానికి పెద్దపీట వేసి మిగిలిన వారిని దూరం పెట్టడమే దీనికి కారణమన్న ప్రచారం సాగుతోంది. దీంతో కూటమిలో కీలకంగా ఉన్న కాపు సామాజికవర్గంతోపాటు యాదవ, రెడ్డి, గౌడ తదితర బీసీ వర్గాల్లో మెజార్టీ నేతలు వర్మ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: పట్టుమని మూడు వేల ఓట్లు కూడా లేకపోయినా ఎమ్మెల్యే సామాజికవర్గ నేతలదే ఈ నియోజకవర్గంలో పెత్తనం. పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల్లో క్షత్రియ సామాజిక వర్గం నేతలు ఇసుకను అక్రమంగా తరలించి పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారు. ఇటీవల పిట్టలవానిపాలెంలోని ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారన్న అక్కసుతో ఒక పోలీసు అధికారిని ఓ నేత బెదిరించిన ఘటన నియోజకవర్గంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ రెండు మండలాల్లో రాజుల పెత్తనం జోరుగా సాగుతోంది. వర్మ యాచరీస్‌లో పనిచేస్తున్న కొందరు గుమస్తాలు కూడా పెత్తనం చలాయించడం చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో ఎవరికి ఏ పని కావాలన్నా ఇప్పుడు ఏదో ఒక రాజును ఆశ్రయించాల్సి వస్తోందన్న ప్రచారం ఉంది. దీనిని టీడీపీ నేతలతోపాటు కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు కూడా జీర్ణించుకోలేకున్నారు.

గెలిచాక మారిన తీరు

బాపట్ల నియోజకవర్గంలో ఎస్సీ సామాజికవర్గంతోపాటు రెడ్డి, యాదవ, కాపు, కమ్మ, గౌడ సామాజి



కవర్గాలు ప్రధాన ఓటు బ్యాంకుగా ఉన్నాయి. గత ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ ప్రభావంతో కాపులు ఇక్కడి టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మకు మద్దతుగా నిలిచారు. యాదవ, గౌడ వర్గీయులూ ఓటు వేశారు. బలమైన రెడ్డి సామాజికవర్గంలోనూ అధిక భాగం టీడీపీ వైపు మొగ్గు చూపారు. ఎన్నికల్లో విజయం తర్వాత ఎమ్మెల్యే వర్మ తీరు ఏరు దాటాక బోడిమల్లన్న చందంగా తయారైందని సొంత పార్టీ వారి నుంచే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రియల్ వ్యాపారులే లక్ష్యంగా...

జిల్లా కేంద్రంతోపాటు నియోజకవర్గంలో కాపులు, రెడ్డి సామాజిక వర్గం వారు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో కీలకంగా ఉన్నారు. అనధికార వెంచర్ల పేరుతో ఇప్పటికే కొన్నింటికి మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీని వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. మరి కొందరు కాపు నేతలు తమ వెంచర్ల కోసం ఇసుక, బుసక తరలించే ప్రయత్నం చేయగా వర్మ అడ్డుకుంటున్నట్లు తెలిసి ఆగ్రహంతో ఉన్నారు.

పార్టీని వీడేందుకు సిద్ధం

అధికారుల బదిలీలు కూడా వర్మ సామాజికవర్గం వారి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. మూడు వేల ఓట్లున్న తన వారికే ఆయన అత్యంత ప్రాధాన్యత ఇవ్వడాన్ని మిగిలిన వర్గాల వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే చాలామంది టీడీపీ నేతలు పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. చాలామంది కాపు నేతలు టీడీపీని వీడేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రధానంగా ఎన్నికల ముందు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కాపు నేత గుంటెడ్డి శివ, మరికొందరు అనుచరులు సహా పార్టీని వీడనున్నట్లు.. బీసీ నేతలు, సర్పంచులూ అదే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

స్టెరాయిడ్స్ ఇచ్చే ఆర్‌ఎంపీలపై చర్యలు



కొల్లూరు పీహెచ్‌సీలో జ్వరం కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ విజయలక్ష్మి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి విజయలక్ష్మి
- ఆర్‌ఎంపీలు, మెడికల్ షాపులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

కొల్లూరు: అవగాహనా రాహిత్యంతో జ్వర పీడితులకు తొలి రోజు నుంచే స్టెరాయిడ్స్ వినియోగిస్తున్న ఆర్‌ఎంపీలు, పీఎంపీలపై చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. అలాంటి వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 'సాక్షి'లో గురువారం 'విష జ్వరాల విజృంభణ' శీర్షికన ప్రచురితమైన కథనంతో స్పందించిన ఆమె కొల్లూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సాధారణ రోగులతో, జ్వర బాధితులతో మాట్లాడారు. వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపీలో ఎక్కువ మంది ఉండటంతో వారి ఆరోగ్య ఇబ్బందులపై ఆరా తీశారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. జ్వరాలపై ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. జ్వర పీడితులకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు మొదటి రోజు నుంచే అధిక మోతాదుతో కూడిన స్టెరాయిడ్‌లు ఇస్తున్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. తక్షణం అలాంటి వారికి నోటీసులు ఇవ్వాలని వైద్యురాలు కె. సంధ్యను ఆదేశించారు. డబ్బు కోసం ఇష్టానుసారం యాంటీబయటిక్స్ ఇవ్వడమే జ్వర బాధితుల్లో ప్లేట్‌లెట్స్ పడిపోవడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం ఉంటుందన్నారు. ఇలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అందరూ కచ్చితంగా సంబంధిత నిబంధనలు పాటించాలని సూచించారు. వాస్తవానికి సమావేశం ఉంటుందని ఆర్‌ఎంపీలు, పీఎంపీలు, మెడికల్ దుకాణాల యజమానులకు ముందుగానే అధికారులు చెప్పారు. కొంతమంది మెడికల్ దుకాణాల యజమానులు మాత్రమే వచ్చారు. వైద్యుల చిట్టీ లేకుండా యాంటీబయటిక్స్ విక్రయించరాదని సూచించారు. కానీ ఆర్‌ఎంపీలు, పీఎంపీలే సొంతంగా మెడికల్ దుకాణాలు నిర్వహిస్తున్నారని డాక్టర్ కె.సంధ్యకు సమాచారం అందింది. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళతామని ఆమె తెలిపారు.

ఊరిలో వ్యర్థాలు.. ఊపిరికే కష్టాలు!

- ప్రజారోగ్యానికి పొగ పెడుతున్న అధికార యంత్రాంగం
- ప్లాస్టిక్ వ్యర్థాలనూ అడ్డగోలుగా తగలబెడుతున్న వైనం
- పెరిగిపోతున్న వాయు కాలుష్యంతో పెను ముప్పు
- చెత్త నిర్వహణలో ప్రభుత్వ తీరుతో తప్పని ఇబ్బందులు

నివాసాల నుంచి సేకరిస్తున్న చెత్త నిర్వహణ, ప్లాస్టిక్ నియంత్రణ, నిషేధం కాగితాలకే పరిమితం అవుతోంది. అధికారులే నిబంధనలకు 'నిప్పు' పెడుతున్నారు. నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువ మైక్రాన్లు గల ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. వీటిని తగులబెట్టడం ద్వారా యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అంతిమంగా ప్రజారోగ్యం దెబ్బతింటోంది



గోకరాజునల్లి బోయినవారిపాలెం షెడ్డు వద్ద తగలబెట్టిన ప్లాస్టిక్ వ్యర్థాలు

శాశ్వత పరిష్కారం చూపాలి



రోజూ ఒక్కో గ్రామం నుంచి టన్నుల్లోనే చెత్త పోగవుతోంది. అత్యధికం ప్లాస్టిక్ వ్యర్థాలే. పొలాల్లోకి వచ్చి ఇవి పడుతున్నాయి. వ్యవసాయం చేయాలంటే ఇబ్బందికరంగా మారింది. దీని కారణంగా భూమి, వాయు, నీటి కాలుష్యం పెరుగుతోంది. అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా తగిన చర్యలు తీసుకోవాలి.

– చిరసాని అప్పిరెడ్డి, భవనంవారి పాలెం

పిట్టలవానిపాలెం: ప్రతి నిత్యం నివాస ప్రాంతాలు, వాణిజ్య సముదాయాల నుంచి వెలువడుతున్న చెత్తలో 80 శాతానికి పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. పిట్టలవానిపాలెం మండలంలో దాదాపుగా అన్ని గ్రామాలలో భారీ ఎత్తున ఇలాంటి చెత్త ఆయా డంపింగ్ యార్డులకు చేరుతోంది. ఇటీవల చెవి, ముక్కు, గొంతు సంబంధిత వ్యాధులు అధికం కావడానికి వాయు కాలుష్యం ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగులబెట్టడం కారణంగా వాయు కాలుష్యం తీవ్రంగా పెరుగుతోందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిరుపయోగంగా షెడ్లు

పిట్టలవానిపాలెం మండలంలో మొత్తం 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కోడూరు, అలకాపురం, భవనంవారి పాలెం పంచాయతీలు మినహా ఇతర చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లను నిర్మించారు. వాటి నిర్వహణకు నిర్దిష్ట ప్రణాళికలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా నిధులు సమకూరుస్తోంది. కార్యాచరణలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీలు చేతులెత్తేస్తున్నాయి. గతంలో రూ.లక్షలు ఖర్చు చేసి ప్రతి పంచాయతీ పరిధిలోనూ షెడ్లు నిర్మించారు. అక్కడ తడి, పొడి చెత్తలను వేరు చేయాలి. తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేసి, అవసరమైన వారికి విక్రయించి ఆయా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకోవాలి. పొడి చెత్తను రీసైక్లింగ్ చేయడానికి కార్యాచరణ ప్రకటించారు. ప్రస్తుతం ఈ షెడ్లన్నీ రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు మాత్రమే ఉపయోగ పడుతున్నాయని సమీప ప్రాంతాల్లోని వారు ఆవేదన చెందుతున్నారు. దాదాపుగా వీటిని నిర్మించి పదేళ్లు కావస్తున్నప్పటికీ పెట్టిన ఖర్చులో పదో వంతు కూడా ఆదాయం రాలేదు. ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తే ఎరువులను విక్రయిస్తున్నట్లు అధికారులు ప్రచారం పక్కాగా చేసుకుంటున్నారు.

నిధుల లేమితో సమస్యలు

తడి, పొడి చెత్తను విడిగా సేకరించడానికి తగిన నిధులు లేవు. మధ్యస్థాయి గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు పది మంది కార్మికులు దీనికి అవసరం అవుతారు. వీరి జీతాలు, నిర్వహణకు నిధులు మంజూరు కావడం లేదు. ప్రజల నుంచే ఈ మొత్తం సేకరించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. ఈ పథకం పట్ల ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన కల్పించకపోవడంతో చెత్తకు కూడా పన్ను వేస్తున్నారంటూ గత ప్రభుత్వంపై ప్రత్యర్థులు విమర్శలకు దిగారు. అప్పట్లో విమర్శలు చేసినవారే ఇప్పుడు అధికారంలో ఉన్న నేపథ్యంలో ప్రజల నుంచి చెత్తపై పన్ను వసూలు చేయకుండా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌లను లాభదాయంగా ఎలా నిర్వహిస్తారన్నదే కీలకంగా మారింది.

దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యం

దీన్ని సక్రమంగా అమలు చేయకపోవడం ప్రజారోగ్యానికి పెను ముప్పుగా మారింది. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల నేపథ్యంలో చెత్తను కనిపించకుండా ప్రభుత్వ యంత్రాంగం శతవిధాలా ప్రయత్నిస్తోంది. ప్రతి గ్రామం చివర కొండల్లా దర్శనమిస్తున్న వ్యర్థాలకు శాశ్వత పరిష్కారాన్ని మాత్రం చూపడం లేదు. యంత్రాంగం ఇప్పటికైనా చెత్త వల్ల ప్రజారోగ్యంపై పడే ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తెలుగు గొప్పతనాన్ని గుర్తించాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



రామస్వామిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాపట్ల: మాతృభాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ కలిసి పుష్పమాలలు వేసి నమస్కరించారు. అనంతరం చెరుకుపల్లికి చెందిన కవి రామస్వామి రెడ్డిని సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవహారిక భాషలోనే రచనలు ఉండాలని గిడుగు రామమూర్తి పంతులు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో జి.రవీందర్, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఒక్క మొక్కనైనా పెంచాలి

తల్లి పేరుతో ఒక మొక్క అనే నినాదంతో అందరూ తమవంతుగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్లో ఆయన ఈ మేరకు మొక్క నాటారు. వన మహోత్సవంపై అధికారులతో కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. ఈ నెల 30వ తేదీన కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా సూర్యలంక ప్రాంతంలో మొక్కలు నాటుతామన్నారు. ఆదివాసీల దినోత్సవంలో ఇచ్చిన హామీలపై కూడా అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్టీల స్థితిగతులపై సెప్టెంబర్ 10వ తేదీలోగా సర్వే నిర్వహించాలని చెప్పారు. కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. చీరాల మండలం దేవాంగపురి, నిరీక్షణనగర్ గ్రామాలలోని చేనేతల స్థితిగతులపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఇటీవల సర్వేలో గుర్తించిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని చెప్పారు. సెప్టెంబర్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఆగస్టు 31వ తేదీన ఉదయం 5 గంటలకే ప్రారంభించాలని అధికారులతో సమీక్షలో కలెక్టర్ తెలిపారు.

- జాతీయ క్రీడా దినోత్సవాన్ని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. బాపట్ల మున్సిపల్ పాఠశాల నుంచి బాపట్ల తహసీల్దార్ కార్యాలయం వరకు విద్యార్థుల ర్యాలీ జరిగింది. జిల్లా కలెక్టర్ వెంకట మురళి, బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల బాలలకు అండ



భవిత కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న మల్లికార్జునరావు

యద్దనపూడి: మానసికంగా, శారీరకంగా వైకల్యం ఉన్న బాలబాలికలకు వివిధ పద్ధతుల్లో విద్యను అందించేందుకు భవిత కేంద్రాలు దోహదపడతాయని రాష్ట్ర సహిత విద్యా విభాగం అధికారి మల్లికార్జునరావు అన్నారు. గురువారం మండల కేంద్రం యద్దనపూడిలోని ఎంపీపీ పాఠశాల ఆవరణలో ఉన్న కేంద్రాన్ని జిల్లా సహిత విద్యావిభాగం అధికారి ఎం. జోత్స్నతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా శాస్త్రసాంకేతిక విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా చూడాలని సూచించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని కోరారు. హెచ్‌ఎంలు ఆయా గ్రామాల్లోని ఇలాంటి విద్యార్థులను గుర్తించి ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం కేంద్రంలోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపి, స్పెషల్ ఎడ్యుకేటర్ రజని, ఐఈఆర్‌టీలు సురేఖ, చిన్న కోటేశ్వరావు, ఆయా రత్నకుమారి పాల్గొన్నారు.

నేడు పల్నాడుకు ముఖ్యమంత్రి



ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి ఏర్పాట్లు వివరిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శుక్రవారం వన మహోత్సవంలో పాల్గొనేందుకు నరసరావుపేట రానున్నారు. హెలికాప్టర్ ద్వారా జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ కు 10.30 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు కళాశాల గ్రౌండ్‌కు చేరుకొని ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఎగ్జిబిషన్ పరిశీలించి 12.45 గంటల వరకు బహిరంగ సభ లో మాట్లాడతారు. 12.55గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.10 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరు కుంటారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పావుగంట ముందుగా 10.15 నిమిషాలకు జేఎన్‌టీయూ సమీపంలో ఏర్పాటుచేసిన హెలిపాడ్ కు చేరుకుంటారు. అక్కడి నుంచి వనమహోత్సవ ప్రదేశానికి చేరుకొని ముఖ్యమంత్రితో కలిసి వన మహోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.40 గంటలకు హెలిపాడ్ నుంచి బయలుదేరి 1.25గంటలకు మంగళగిరి క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు. 600 మంది అధికారులు, సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

మేటి క్రీడాకారులుగా ఎదగాలి

జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడలపై ఆసక్తితో మేటి క్రీడాకారులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గత విద్యా సంవత్సరంలో క్రీడల్లో ఎక్కువ మందిని రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఆడించి, జిల్లాస్థాయిలో అత్యుత్తమంగా నిలిచిన ఐదు పాఠశాలలకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కలెక్టరేట్ వద్ద ఉన్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో భాగంగా నారాకోడూరు, నూతక్కి, ఉప్పలపాడు, కొర్రపాడు, మందపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత కొన్నేళ్లుగా విద్యాశాఖ ఆధ్వర్యంలో క్రీడా ప్రతిభా పురస్కారాల్ని అందజేస్తోందన్నారు. ఇందులో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికి గానూ ఐదు పాఠశాలలకు ప్రదానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎం.రవి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, ఆర్ఐపీఈ బాషా, సంఘ జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. వెంకటేశ్వరరావు, రమేష్, అశోక్ పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో మరో ఐదుగురు సీఐల బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో మరో ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు. బాపట్ల జిల్లా డీటీసీ సీఐ సీహెచ్.సింగయ్యను గుంటూరు జిల్లా పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు, ఏసీబీ సీఐ బి.రవీంద్రబాబును గుంటూరు జిల్లా ఫిరంగిపురం పీఎస్‌కు, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న పి.భాస్కర్‌ను పల్నాడు జిల్లా గురజాల పీఎస్‌కు, ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్ట్ సర్కిల్ సీఐ కె.వెంకటరెడ్డిని ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా దక్షిణ ట్రాఫిక్ పీఎస్‌కు, గుంటూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న కె.రామకృష్ణను ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా ఉత్తర ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


రెంటచింతల: రెంటచింతలలో ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన బుధవారం అర్ధరాత్రి జరిగింది. లూర్దు మాత మందిరం సమీపంలోని ఓ గొందిలో రాత్రి 12 గంటల తర్వాత గుర్తు తెలియని ద్విచక్రవాహనం దగ్ధం కావడంతో చుట్టు ప్రక్కల వారు ఆ మంటలకు లేచి చూసే సమయానికి అక్కడ ఎవరూ లేకపోవడం గమనించారు. ఆ ద్విచక్రవాహనం పక్కనే మండవ రామారావుకు చెందిన కారుపై కప్పిన పట్టకు కూడా నిప్పు అంటుకోవడంతో వెంటనే నీళ్ల పోసి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ద్విచక్రవాహనం ఎవరిదో ఇప్పటి వరకు ఆచూకీ తెలియని పరిస్థితి. ఈ ఘటన వలన ఆరుబయట పార్కింగ్ చేసే వారు ఆందోళనకు గురౌతున్నారు.

శిక్షలు కఠినంగా అమలు చేయాలి



కోల్‌కత్తా మెడికల్ కళాశాలలో విధి నిర్వహణలో ఉన్న మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నేరస్తులు తప్పించుకోకూడదు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారణ చేసి కఠిన శిక్షలు అమలు చేయాలి. అప్పుడే భవిష్యత్‌లో ఇటువంటి ఘోరాలు జరగకుండా ఉంటాయి. ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, హాస్పిటళ్లలో పోలీసుల రక్షణతోపాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ ఎల్లప్పుడూ ఉండాలి. ఐఎంఏ బాధ్యత తీసుకొని ప్రభుత్వాలు అమలుచేసేలా పోరాటం చేయాలి.

–డాక్టర్ కె.వసంతరాయ, గైనకాలజిస్టు, నరసరావుపేట



పోలీసులు, సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలి




కోల్‌కతా సంఘటన మరోసారి జరగకూడదు. ఇది చాలా బాధాకరం. ప్రభుత్వ హాస్పిటళ్ల, మెడికల్ కళాశాలలో తప్పనిసరిగా వైద్యులకు తగిన రక్షణ ఏర్పాట్లు ఉండాలి. ముఖ్యంగా మహిళలకు చాలా అవసరం. పోలీసుల పర్యవేక్షణ, సీసీ కెమెరాల నిఘా ఎంతో అవసరం. ఈ సంఘటనలకు పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షిస్తేనే మరోసారి జరగకుండా ఉంటాయి.

–డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, నరసరావుపేట

ముచ్చటగా మూడు నెలల పాలన ముగియక ముందే కూటమిలో నామినేటెడ్ పదవుల పందేరం తెరపైకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక జనసేన, బీజేపీ, టీడీపీల మధ్య మంత్రివర్గం కూర్పు వరకు కాస్త సజావుగానే వ్యవహారం సాగినట్లు కనిపించింది. ఇప్పుడు కింది స్థాయి పదవుల భర్తీ మాత్రం మూడు పార్టీలకూ కత్తిమీద సాముగానే ఉంటుందని భావిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ వ్యవహారంలో టీడీపీకే ఎక్కువ తలనొప్పులు వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఆశావహులు ఎక్కువగా ఉండటమే దీనికి కారణం.

ఆశావహులు వందల్లో..

పదవులు పదుల్లో!



- కూటమిలో భారీగా 'నామినేటెడ్' ఆశావహులు
- భర్తీకి మూడు పార్టీల అధిష్ఠానాల కసరత్తు
- అందరికీ న్యాయం చేసే అవకాశాలు అంతంతే
- జనసేన, బీజేపీకి ప్రాధాన్యత ఇస్తే తమ్ముళ్లకు నిరాశే
- తమ సామాజికవర్గాల వారివైపే ప్రజాప్రతినిధుల మొగ్గు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కూటమిలోని మిగతా రెండు పార్టీలకు టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వకుండా సమతూకం పాటించాలని తమ్ముళ్లు కోరుకుంటున్నారు. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలున్న దగ్గర మాత్రమే ఆ పార్టీల వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చే దిశగా ఆలోచించాలని కోరుతున్నట్లు సమాచారం. ఇదే జరిగితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిగినట్లు జనసైనికులకు మళ్లీ సర్దుపోటు తప్పదని భావిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పార్టీలో కొనసాగుతూ అధికారంలోకి తెచ్చుకున్నందున తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తమ్ముళ్లు తమ నేతలకు గుర్తుచేస్తున్నారు.

వ్యూహాత్మకంగా వ్యాఖ్యలు

అసలు పొత్తు లేకున్నా తాము అధికారంలోకి వచ్చేవారమని కొందరు టీడీపీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారు. జనసేన నేతల ఉత్సాహంపై నీరు చల్లేలా పచ్చ పార్టీకి చెందిన ఓ సామాజికవర్గం వారు ఇలా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. తమతో సమానంగా పదవుల్లో వాటాలు పొందే అవకాశం జనసేన వారికి ఇవ్వడం తగదన్న భావనలో వారున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జనసేన, బీజేపీలకు నామమాత్రపు బలమే ఉందని మరికొందరు వ్యాఖ్యలు చేస్తున్నారు. దానికి అనుగుణంగా ఆయా పార్టీలకు పదవులు పంచిపెట్టాలని తమ్ముళ్లు కోరుతున్నారు. వ్యూహాత్మకంగా జనసేన, బీజేపీ వారిని ఈ పోటీ నుంచి వెనక్కు నెట్టే ప్రయత్నంలో భాగంగా తమ్ముళ్లు ఇలా చేస్తున్నారు.

జాబితా పెద్దదే..

నామినేటెడ్ పదవుల కోసం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వందల మంది టీడీపీ వారు ఎదురున్నారు. వారి పేర్లను భర్తీ సమయంలో ఆ పార్టీ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకోనుంది. ఇందులో ఎమ్మెల్యేలు, అబ్జర్వర్లు ఇచ్చిన వారి వివరాలను సరిపోల్చుకుంటోంది. మెరుగ్గా పనితీరు ఉన్న వారికి నామినేటెడ్ పదవులతోపాటు పార్టీ పదవులు కట్టబెడతామని సంకేతాలిచ్చింది. దీంతో టీడీపీ నుంచి పెద్దసంఖ్యలో ఆశావహులు ఉన్నారు. కానీ వీరి ఆశలకు జనసేన, బీజేపీ నేతలు గండికొట్టేలా కనిపిస్తున్నారు. ఇప్పటికే ఈ రెండు పార్టీలకు ఏయే పదవులు ఇస్తున్నారో చెప్పే జాబితాలు సోషల్ మీడియాలో జోరుగా చక్కర్లు కొడుతున్నాయి. ఇది తమ్ముళ్లకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే పదవుల భర్తీ ఆలస్యమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

తమ సామాజిక వర్గాలకే పెద్దపీట



నామినేటెడ్ పదవులను జిల్లాలోని మంత్రులు, శాసనసభ్యులు తమ సామాజికవర్గాలకు కేటాయించాలనే ఆలోచనలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో టీడీపీ అధినేత సామాజిక వర్గ నాయకులు అప్రమత్తమయ్యారని సమాచారం. కొన్నిచోట్ల బహిరంగంగానే దీనిపై వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో వేమూరు ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం. రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్‌ది బీసీ సామాజికవర్గం. బాపట్ల నుంచి ఎన్నికైన వేగేశన నరేంద్రవర్మ రాజుది ఓసీ సామాజికవర్గం కాగా, చీరాలలో కొండయ్య యాదవ్ బీసీ వర్గానికి చెందిన వారు. పర్చూరు నుంచి ఏలూరి సాంబశివరావు, అద్దంకి నుంచి ఎన్నికైన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌లు ఓసీ సామాజిక వర్గం వారు. వీరందరూ తమ వారికే పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రయత్నిస్తున్నారు. దీంతో మిగిలిన వర్గాలు దీనిపై అసంతృప్తిగా ఉన్నాయి. జాబితా అధికారికంగా ఖరారైతే టీడీపీతోపాటు జనసేనకు కూడా ఈ వ్యవహారం పెద్ద తలనొప్పిగా మారే సూచనలు మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాయి.

కత్తితో దాడి కేసులో నిందితుడికి ఏడాది జైలు

వేమూరు: చావలి గ్రామంలో కత్తితో దాడి చేసి గాయపరిచిన కేసులో నిందితుడికి కోర్టు సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ రవికృష్ణ గురువారం తెలిపారు. వేమూరు మండలంలోని చావలి గ్రామానికి చెందిన సోమరౌతు కోటయ్యను ప్రసాద్ గతేడాది డిసెంబరు 18వ తేదీన కత్తితో పొడిచాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు ప్రసాద్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. తర్వాత రిమాండ్‌కు తరలించారు. తెనాలి ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీమ్ శ్రీధర్ కేసును విచారించి ప్రసాద్‌కు ఏడాది జైలు శిక్ష విధించారని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.ఎలిజబెత్ వాదించినట్లు పేర్కొన్నారు.

బెదిరించి బాలికపై యువకుడి లైంగిక దాడి

అద్దంకి రూరల్: బాలికలు, మహిళలకు నానాటికీ రక్షణ కొరవడుతోంది. రోజుకొకచోట దారుణాలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా ఓ యువకుడు పాల్పడిన దుశ్చర్య వెలుగు చూసింది. గత ఆరు నెలలుగా పదో తరగతి చదువుతున్న బాలికను అతడు బెదిరిస్తూ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని తిమ్మాయిపాలెంలో జరిగిన ఈ సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. అద్దంకి పట్టణంలోని కట్టకిందపాలేనికి చెందిన సంపెంగుల రాజేష్ ఆరు నెలలుగా తిమ్మాయిపాలెంలో 10వ తరగతి చదువుతున్న బాలికను వెంబడిస్తున్నాడు. ఆమెను వేధిస్తూ స్కూల్ నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో బెదిరించి ఇప్పటివరకు నాలుగు సార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ద్వారా ఆలస్యంగా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు.. యువకుడి కుటుంబానికి చెప్పినా పట్టించుకోలేదు. దీంతో గురువారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు స్థానిక ఎస్సై ప్రవీణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రతి ఇంటికి తాగునీటి సరఫరాకు చర్యలు



మాట్లాడుతున్న తేజ్ సంగీత్

చినగంజాం: ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటిని సరఫరా చేయడమే జలజీవన్ మిషన్ లక్ష్యం అని జిల్లా కో ఆర్డినేటర్ తేజ్ సంగీత్ అన్నారు. గురువారం కడవకుదురు గ్రామ సచివాలయంలో సర్పంచి జీ శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్ ద్వారా మనిషికి 55 లీటర్ల వంతున తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అమలు చేసుకోవాలని సూచించారు. జలజీవన్ మిషన్ జిల్లా సమన్వయకర్త టీ రంగారావు మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడాలని, ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. తద్వారా భావి తరాలకు నీటి ఎద్దడి నుంచి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ పీ బాల సాయికుమార్, స్వచ్ఛ భారత్ మండల కో ఆర్డినేటర్ నన్నం అశోక్, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్‌లు, వీఓలు పాల్గొన్నారు.

8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా ఫిట్‌నెస్ బాడీబిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 8న మిస్టర్ జోనల్ బాడీ బిల్డింగ్ పోటీలు, రాష్ట్రస్థాయి కెటిల్‌డెల్ చాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం పోటీలు జరిగే స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆవిష్కరించారు. ప్రతి అసోసియేషన్ విధిగా క్రీడా పోటీలు నిర్వహించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. కార్యక్రమంలో నాగ గౌతమ్, ఎండీ జావెద్ అహ్మద్, డాక్టర్ సతీష్, రాజ్ కుమార్, అభిషేక్ పాల్గొన్నారు.

తీరంలో సినిమా షూటింగ్ సందడి





చీరాల తీర ప్రాంతంలో జరుగుతున్న సినిమా షూటింగ్ దృశ్యాలు

చీరాల: ప్రముఖ హీరో గోపీచంద్ డైరెక్షన్‌లో మైత్రి మూవీస్ బ్యానర్‌పై హిందీ సినిమా షూటింగ్ జరుగుతోంది. సన్నీడియోల్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో చీరాల, రామాపురం తీర ప్రాంతంలో ఫైటింగ్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. షూటింగ్ చూసేందుకు వందల మంది తరలిరావడంతో ఈపూరుపాలెం ఎస్సై శివకుమార్ తగిన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం గోపీచంద్ మాట్లాడుతూ.. తాను హిందీ సినిమాను డైరెక్ట్ చేయడం ఆనందంగా ఉందన్నారు. సన్నీడియోల్, పలువురు అగ్రతారలు నటిస్తున్నట్లు తెలిపారు. త్వరలో సినిమా పేరు ప్రకటిస్తామన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో నిబంధనలకు విరుద్ధంగా సెమిస్టర్ ఎగ్జామ్ నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ కోఆర్డినేటర్ బి.శేఖర్‌బాబును ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు అడ్డుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీ ఎగ్జామ్‌ను షెడ్యూల్ ప్రకారం గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరపాలి. సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా నిర్దేశించిన షెడ్యూల్ కంటే ముందు ఉదయం 10 గంటలకే నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు సమాచారం తెలుసుకున్నారు.ఈ విషయంపై డిపార్టుమెంట్ కోఆర్డినేటర్‌ను వివరణ కోరగా విద్యార్థి రిక్వెస్ట్ చేయడంతో షెడ్యూల్ కంటే ముందే జరపాల్సి వచ్చిందని ఆయన చెప్పారు. ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థిని అడుగ్గా తాను అడగలేదని తెలిపాడు. నాయకులు విషయాన్ని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ దృష్టికి తీసుకుని వెళ్లగా, ఆయన రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయమని సూచించారు. నాయకులు విషయాన్ని ఇన్‌చార్జ్ వైస్ చాన్సలర్, రెక్టార్, రిజిస్ట్రార్‌ల వద్దకు తీసుకుని వెళ్లి సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై యూనివర్సిటీ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగంలో సమస్యలు ఉన్నాయని, ఈ విషయంతో పాటు వాటి మీద కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థి నాయకులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎఫ్ ప్రెసిడెంట్ రత్నసాగర్, సెక్రటరీ గణేష్, వైస్ ప్రెసిడెంట్ రత్న కిశోర్, ట్రెజరర్ మధు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు పల్నాడు స్విమ్మర్లు



నరసరావుపేటఈస్ట్: జాతీయస్థాయి ఆక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి ఇద్దరు స్విమ్మర్లు ఎంపికైనట్టు పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 25వ తేదీన శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 10వ సీనియర్ అంతర్ జిల్లాల చాంపియన్‌షిప్ పోటీలలో ప్రతిభ కనపరిచిన ఎస్.జగదీష్ (స్విమ్మింగ్), ఎస్.మానసకుమార్ (వాటర్ పోలో) పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. కర్నాటక రాష్ట్రం మంగుళూరులో సెప్టెంబర్ 10 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న జాతీయస్థాయి పోటీలో జగదీష్ స్విమ్మింగ్ పోటీలోనూ, కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో సెప్టెంబర్ 18 నుంచి 22వ తేది వరకు జరగనున్న జాతీయస్థాయి వాటర్ పోలో పోటీలో మానసకుమార్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన స్విమ్మర్లను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కోచ్ జి.సురేష్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

చెంచు, గిరిజనుల జీవితాలలో వెలుగులు

వెల్దుర్తి: ప్రధానమంత్రి మోదీ చెంచు, గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపేందుకు పీఎం జన్‌మన్ పథకాన్ని తీసుకొచ్చారన్నారని ఐటీడీఏ స్పెషలాఫీసర్ ధనుంజయ, సూపరింటెండెంట్ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని దావుపల్లి, శిలువకొండ, కుంకుడు చెట్టు తండా, గుడిపాటి చెరువు గ్రామాల్లో జరిగిన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెంచుల జీవితాలను మెరుగుపర్చేందుకు అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చాయన్నారు. చెంచు గూడెంలలో కావాల్సిన మౌలిక సదుపాయాలను గుర్తించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ గ్రామసభల్లో చర్చించి వారికి కావాల్సిన పథకాలను గుర్తించి మంజూరు చేయించి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. చెంచు గిరిజనులు వారి తండాలకు కావాల్సిన మౌలిక వసతుల సదుపాయాలను అర్జీల రూపంలో అందించారు.

విజ్ఞాన్‌లో జాతీయ క్రీడా దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ముందుగా జాతీయ జెండాతో భారీ ర్యాలీ చేపట్టారు. వైస్ చాన్సలర్ పీ.నాగభూషణ్ మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడల్లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలను అందించిన ఘనత ధ్యాన్‌చంద్‌కే దక్కుతుందన్నారు. ఆయన పేరుమీదనే భారత ప్రభుత్వం క్రీడల్లో అత్యున్నత పురస్కారమైన 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డును క్రీడాకారులకు అందజేస్తుందన్నారు. విద్యార్థులందరూ ఆటల్లో పాల్గొనాలనే ఉద్దేశంతో విజ్ఞాన్ యూనివర్సిటీలో మూడు సెమిస్టర్‌లలో స్పోర్ట్స్‌కు సంబంధించిన అంశాలకు మార్కులు కూడా కేటాయించామన్నారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకోవాలని, అనుకున్నది సాధించేదాక కష్టపడి పనిచేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఎప్పుడు కూడా నిర్లక్ష్యంగా ఉండకుండా... ఎప్పుడు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం వివిధ క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి

గుంటూరు జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు వెస్ట్ జీవితంలో గెలుపోటములు సహజమనే విధానం క్రీడల్లో చూడగలమని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి స్థానిక బి.ఆర్.స్టేడియంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. గత నాలుగు రోజుల నుంచి నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు జేసీతోపాటు, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, తదితరులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నసీర్ అహ్మద్ మాట్లాడుతూ స్టేడియం క్రీడాకారులతో కళకళలాడాలన్నారు. ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రతి ఏటా ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

రసవత్తరంగా కృష్ణా, పశ్చిమ గోదావరి మ్యాచ్

నరసరావుపేట ఈస్ట్: ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 క్రికెట్ పోటీల్లో భాగంగా కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ రసవత్తరంగా మారింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు నిన్నటి ఓవర్ నైట్ స్కోర్ ఐదు వికెట్లు నష్టానికి 266 పరుగులతో గురువారం బ్యాటింగ్ ప్రారంభించి 331 పరుగులకు ఆలౌట్ అయింది. కృష్ణా బ్యాట్స్‌మెన్‌లు సుశాంత్‌నాయుడు 86, అనంత్‌కార్తికేయ 61, శ్రీనిశ్చయ్ 59 పరుగులు సాధించారు. పశ్చిమగోదావరి బౌలర్లు దీపక్‌చంద్ 4, పి.భువనేశ్వర్ 3 వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఏడు వికెట్లు నష్టానికి 172 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 57 పరుగులు చేశాడు.